# సుఖ జీవనం

సత్యనారాయణ ఈ వయసులో సుఖంగా జీవిస్తున్నాడని అంతా అనుకుంటుంటారు. ఈ సుఖ జీవనానికి దారి తీసిన అసలు రహస్యం ఏమిటి? అతన్నే అడిగే ముందు తనచుట్టూ ఉన్నవారు అనుకునే కారణాల్లో కొన్ని ఏమిటంటే—

అతనిది వాళ్ళమ్మలా కాయశరీరం. ఈ అరవయ్యోపడిలో రోజూ ఆరు కిలోమీటర్లు సునాయాసంగా అందుకే నడిచేస్తున్నాడు. అతని భార్య పూజల ఫలితం ఇది. ఇద్దరూ ఎంచక్కా చిలకా గోరింకల్లా తిరుగుతున్నారో! తల్లిదండ్రుల పెంపకం తోడైనా, తమంతట తాము కష్టపడి చదివి పిల్లలు పైకొచ్చారుకదా! వాళ్ళను చూస్తే సంతోషంతో కడుపు నిండిపోతుందే! రిటైరయ్యేసరికి తలదాచుకోడానికి ఓ ఇల్లనీ, పిల్లల బాధ్యతలన్నీ తీర్చుకుని, కన్న బిడ్డలమీద కూడా ఆధారపడకుండా సరిపడే పింఛను ఆర్జించుకుని, అంతా ఒక ప్లాను వేసుకుని, ఆ ప్రకారం నడవబట్టి హాయిగా ఉన్నాడు. అతను ఆఫీసరుగా ఆర్జించిన పేరు ప్రతిష్ఠలు చాలవా? ఇదంతా ఒక ఎత్తు. దేనికైనా పెట్టిపుట్టాలి కదా! అదృష్టం అంటూ ఉంటే ఏదీ చెయ్యిజారిపో దంటారు. అదృష్టవంతుడు కాబట్టే సుఖపడుతున్నాడు.

ఎక్కడకు వెళ్ళినా నవ్వుతూ సుఖాన్ని నలుగురికీ పంచిపెడుతున్న సత్యనారాయణనే అడిగితే "నాకేం తెలీదు. మామూలుగానే ఉన్నాను" అంటాడు.

"అలాగంటే ఎలాగండి? యోగాసనాలు గాని వేస్తున్నారా?"

"అబ్బే! అలాంటివేవీ రావు. తింటాను. నిద్రపోతాను. రెండుపూటలా కాస్త దూరం నడుస్తాను - అంతే!"

"మరి ఆలోచించరా?"

"నా జీవితంలో రెండు ముఖ్యావస్థలు - ఒకటి చదువుకునే రోజులు - రెండు అధికారంలో ఉన్న రోజులు. చదువుకునే రోజుల్లోనిది ఒక్కటే జ్ఞాపకం ఉంది."

''ఏమిటది?''

''ఆరోగ్యమే మహాభాగ్యం.''

''అయితే, ఆ మహాభాగ్యం కోసం అధికారంలో ఉన్నప్పుడేం చేశారు?''

''సంక్రమించిన అధికారాన్ని ఆరోగ్యవంతంగా ఉంచడానికి ప్రయత్నించాను.''

"గోతుల్లేని మనసుతో బతికారు. మరి, పాపమనే మురికినీరు చేరడానికి అవకాశం ఎక్కడిదీ?" అన్నాడొక మిత్రుడు.

ఈ మాటలన్న వ్యక్తి వెళ్ళిపోయినా అంగట చీకట్లో సత్యనారాయణ ఒంటరిగా అలా మడత కుర్చీమీద కూర్చుండిపోయాడు. పెరటనున్న జామచెట్టు మీద పలకబారిన జామకాయలను కొరుకుతూ చిలకలు అరుస్తున్నాయ్. పదిమందీ వేసే ప్రశ్న ఈ చిలకకి వేస్తే బావుండేది. సమాధానం వచ్చేదేమో? తనుమట్టుకు తను ఇదివరలానే బతుకుతున్నాడు. వయసులో ఎలాగైనా హాయిగా బ్రతుకుతారు గానీ - వయసు మళ్ళాక సుఖంగా బతకడం ఒక గొప్ప విషయంగా తన చుట్టూ ఉన్నవాళ్ళు భావించి, తన దగ్గర నేర్చుకుందామని చూస్తున్నారు. తనకు కారణం ఇదీ అని తెలిస్తేగా చెప్పడానికి?

అంతలో ఎవరో బయట గేటుదగ్గర నిల్చోవటం చూశాడు.

''ఎవరు కావాలి?'' అడిగాడు సత్యనారాయణ.

''మీరే కావాలి సార్! లోపలికి రావచ్చా సార్?''

సత్యనారాయణ లేచి అంగట లైట్లు వేశాడు. ఆ వెలుతుర్లో వాడిని పోల్చుకున్నాడు గానీ వాడి పేరు తెలియదు. ఎప్పుడైనా కనిపిస్తే ఆగి నమస్కారం చేసి కదిలేవాడు వీడేకదా! మనిషి కాలంలో ఉన్నాడు. కళ్ళు కాంతితో మెరుస్తున్నట్లున్నయ్. వినయంతో తలవంచి నిల్చొనే ఉన్నాడు. అలా నిలబెట్టే ''నా పనేమైనా ఉందా?'' అడిగాడు సత్యనారాయణ.

''నాపేరు సువర్ణరత్నం, అయ్యా! మీ విలువైన కాలంలో నా కోసం కొద్ది నిముషాలు ప్రత్యేకించగలరా?"

"అలాగే, రండి కూర్చోండి" అంటూ మళ్ళీ అంగట పూలతోటలోని కుర్చీల దగ్గరకు వచ్చాడు.

నెమ్మదిగా కూర్చొని వినయంగా "అయ్యా! అంత పెద్ద ఉద్యోగం చేసినా ఏనాడూ తమరు, మీ అధికారం ఉన్న చేతులకి గజ్జిగానీ, రక్తం మరలు కానీ తగిలించుకోలేదు. మీలాంటి వాళ్ళతో నా బతుకు ఏమిటో చెప్పుకోడానికి ఈ వేళకి ఆ అవకాశం దొరికింది."

"మీక్కావలసినంత కాలం తీసుకోండి. వివరంగా చెప్తే వినే ఓపిక ఉంది" అని సత్యనారాయణ సువర్ణరత్నానికి ధైర్యం చెప్పాడు.

సర్దుకుని కుర్చీమీద కూర్చుని "మీ ఎదురుగా కూర్చోడానికి తగిన తాహతు లేనివాడిని. ఐనా మీరు కనికరించి కూర్చోబెట్టారు. ఇంతో అంతో చదువుకున్నాను. ఏ అలవాటైన తగిలించుకోవటం సులభం. వదిలించుకోవటం కష్టం కదా! చేతనైనది తక్కువ, కావలసినది ఎక్కువై పోయింది. కావలసింది దొరక్కపోగానే శైత్యం, పైత్యం చేసి పరారైపోయాను. పరారై కడుపుకోసం కప్పలా గెంతాను. మింగడానికి వెంట తరిమిన పాములా పోలీసులు వెంట పడతారని భయంతో తిరిగి ఇంటికొస్తే గజ్జికుక్కను చూసినట్లు కన్నవాళ్ళే చూశారు. వాళ్ళన్నది నిజమే. పాడైపోయాను. నాకు కాదని నా తమ్ముడికి పెళ్ళి చేసేశారు. వాడు అందమైన పెళ్ళాంతో నా ఎదురుగా కులుకుతూ కదులుతుంటే కోరికలతో కుంగిపోయాను. చేతకానివాణ్ణి ఏం చేస్తాను? రోజుకు రోజు అవమానంతో క్రుంగిపోయాను. ఊరవతలకు వెళ్ళి ఒంటరిగా అదేపనిగా ఏడ్చాను. ముడుకులమీద ఆన్చిన తలమీద నాలుగు చినుకులు రాలాయి. ఆవలించిన నోటిలో తేనెచుక్కల్లా రాలినయ్. ఎదరగా ఉన్న చెట్లచివర్లో పువ్వుల్లా మబ్బులు నిల్చున్నాయ్.

"ఈ మబ్బులూ, చినుకులూ మనిషి సృష్టించలేడు. మనిషి అవసరాలు చూసిన వాడెవడో సృష్టించి ఉండాలి. వాడి దగ్గరకు వెళ్ళాలి. అందరూ అతని దగ్గరకు వెళ్ళలేరు. నేను చేసిన పాపాలన్నీ ఒక కాగితం మీద రాసుకున్నాను. కంఠస్థం చేసుకున్నాను. అతని దగ్గరకు వెళ్ళాను. తల వంచి నా పాపాలకు మనసులో పదేపదే ఏడ్చాను. నాపశ్చాత్తాపంతో అతని కరుణ కలిగిందేమో? నాలో అదొకలాంటిమార్పు అదేదో పరివర్తనలా వచ్చేసింది. నేనేం చేస్తున్నా, నేను చెయ్యలేదన్న భావం వచ్చేసింది. ఆ మబ్బు కదులుతున్నట్లు మబ్బుకు తెలీదు. ఆ చినుకులు రాల్చుతున్నట్లు ఆ మబ్బుకు తెలీదు. నేనెక్కడకు వెళ్తున్నానో నాకూ తెలీదు ఆ దేముడే నన్ను నడిపిస్తున్నాడు. అతను చూపిన తోవగుండానే

చదుస్తూ వచ్చాను. నాకు నమ్మకం ఉంది. ఆ ప్రభువు తను అనుగ్రహించిన వాని దగ్గరకే నన్ను తీసుకువెళ్తాడని, ఆ మనిషే అతని ప్రతిబింబంగా ఉంది, అతని ద్వారానే అతనుకున్న మంచి పనులన్నీ చేయిస్తాడని- ఈ పట్నం తీసుకు వచ్చాడు.

నా చదువుకు తగ్గ ఉద్యోగం ఇచ్చే మనిషి దగ్గరకే ఆ ప్రభువు నన్ను నడిపించాడు. ఉద్యోగంతో నాకు కొంత బ్రతుకు ఆదరవు దొరికింది. నాకు పిల్లనివ్వడానికి ముందుకొచ్చారు. నాకన్నా బాగా చదువుతున్న భార్య వచ్చింది. ఆమె దగ్గర చదువు నేర్చుకున్నాను. ఆమె టీచరుపని చేస్తోంది. మాకు ఒక అమ్మాయి, ఒక బాబు. ప్రతి మనిషికీ కడుపు ఉంది, మనసుంది. రెండింటినీ పోషిస్తేగానీ మనిషికి సుఖం ఉండదు. ఇప్పుడు ఉద్యోగరీత్యా లేబర్‌నించి ఫిట్టరయ్యాను. దీనివల్ల నా ఒక ఆకలి పోయింది. అసలైన ఆకలి మనసుది. సంతోషం, సమాధానం ఎరగని ఆకలి అది. ఆ ఆకలి కొంతలో కొంతయినా తీరుతుందని - సాయంత్రం వేళల్లోనూ, ఆదివారంఖాడూ ప్రభువు సేవకునిగా ఉండి, అతని గొప్పను కీర్తిస్తుంటాను. నాలాంటి పాపికి అతను పెట్టిన క్షమాభిక్షను తల్చుకుంటుంటాను. అతనినుంచి పొందిన దయారసాన్ని ఏదో విధంగా నేనూ, నా చుట్టూ వున్న బాధపడ్డవాళ్ళకు 'పంచిపెట్టాలని ప్రయత్నిస్తుంటాను. రోజూ ఆ ప్రభువుకు చేసే ప్రార్థన తరవాత చివర్లో ఒకే ఒక కోరిక కోరుకుంటాను."

"ఏమిటది?"

నాకు ఉద్యోగం ఇచ్చి, మనిషిగా బ్రతకనిచ్చిన ఆ మహానుభావుడికి ఆరోగ్యం, సుఖం, సంతోషం ప్రతిపాదించు ప్రభువా-అని వేడుకుంటుంటాను."

"నీ ప్రార్థనకు నోచుకున్న ఆ అదృష్టవంతు డెవడు?'' అడిగాడు సత్యనారాయణ.

"అధికారంతో అతను ఎన్నివందల బతుకుల్లో దీపాలు వెలిగించాడో! అంతమంది నాలాగే అతని కోసం ప్రార్థనలు చేస్తుంటారు.''

"ఇంతకీ ఆ అత నెవరు?''

''ఇంతమందికి ఉపకారం చెయ్యడం వలన అతనికి ఉపకారం పొందిన వాళ్ళ ముఖాలు గుర్తుండకపోవటం సహజమే. నాకు ఆ ఉద్యోగ భిక్ష పెట్టింది తమరే....తమరే!"

సత్యనారాయణ తన సుఖ జీవనానికి అసలు రహస్యం ఇప్పుడు తెలుసుకున్నాడు.

*

(1989)